క్లుప్తంగా

రేషన్ షాపు తనిఖీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): సర్కిల్–2 పరిధిలోని సత్యనారాయణపురం మధురానగర్ ఏరియాలో 215వ రేషన్ షాపును నార్త్ తహసీల్దార్ సూర్యారావు జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీ చేశారు. జనవరి నెల పంపిణీ ముగుస్తున్న వేళ శుక్రవారం సాయంత్రం ఏరియా చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు భగీరథ, మణికంఠతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ పోస్ట్‌లో ఉన్న స్టాకు నిల్వలకు షాపులో ఉన్న నిల్వలను సరిపోల్చారు. స్టాకు బోర్డులు, రికార్డుల నిర్వహణ, దుకాణం పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించారు. ప్రజలకు పారదర్శకంగా, మరింత మెరుగైన సేవలు అందించేందుకు తాము ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సూర్యారావు తెలిపారు.

21న విశ్వనాథ భాగవతార్ జయంతి వేడుకలు

విజయవాడ కల్చరల్: విఖ్యాత హరికథా భాగవతార్ అమ్ముల విశ్వనాథం 109వ జయంతి వేడుకలను దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో ఈ నెల 21వ తేది మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు భాస్కర్ల వేంకటసతీష్, బీవీ దుర్గాభవానీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరానికిగానూ తిరుపతికి చెందిన హరికథా భాగవతారిణి జయంతి సావిత్రికి హరికథా చూడామణి పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

రేపు ఇంటర్ విద్యలో సంస్కరణలపై సెమినార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంటర్ విద్యలో సంస్కరణలకు సంబంధించి ఈ నెల 19వ తేదీ గాంధీనగర్‌లోని శారద కళాశాలలో సెమినార్ నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియెట్ విద్యా పెన్షనర్స్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గుమ్మడి నారాయణరావు, సంయుక్త కార్యదర్శి ఎల్.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెమినార్‌లో పదవీ విరమణ చేసిన జూనియర్ లెక్చరర్స్, ప్రిన్సిపాల్స్, బోర్డు అధికారులు, ఆర్ఐఓలు, ఆర్జేడీలు, డీవీఈవోలు హాజరవుతారన్నారు. ఇంటర్ విద్యలో సంస్కరణలు, మొదటి సంవత్సరం పరీక్షలు రద్దు, ఆప్షనల్ సబ్జెక్ట్ విధానం వంటి వాటిపై సెమినార్‌లో చర్చించనున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సంకట చతుర్థి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరం, శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం, శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన శుక్రవారం సంకట చతుర్థి పూజలు ఘనంగా జరిగాయి. వినాయకుడికి విశేషంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మైనార్టీ బాలికల హాస్టల్‌కు అద్దె భవనం కావాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ పరిసర ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయం(మైనార్టీ బాలికలు) హాస్టల్ కోసం అద్దె ప్రాతిపదికన భవనం కావాలని సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాస్టల్ కోసం 30వేల చదరపు అడుగుల భవనం అద్దెకు కావాలని, ఔత్సాహికులు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలకు 87126 25036 నంబరులో సంప్రదించాలని కోరారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం విజయవాడకు చెందిన శ్రీనృత్య కళానిలయానికి చెందిన నృత్యకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై గోనుగుంట శైలశ్రీ పర్యవేక్షణలో చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శన అనంతరం శిష్యబృందానికి ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందజేయడంతో పాటు అమ్మవారి దర్శనం కల్పించారు.

యూజీడీ పంపింగ్ స్టేషన్

పూర్తయ్యేనా.?



యూజీడీ పంపింగ్ స్టేషన్

- ఐదు నెలలుగా నిలిచిన పనులు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పైపులైన్ పనులు పూర్తి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వేగంగా అభివృద్ధి చెందుతున్న గద్దే వెంకట్రామయ్యనగర్‌లో యూజీడీ(అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ) పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇక్కడ యూజీడీ పనులు నత్తనడకన సాగుతూ స్థానికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. యూజీడీ అందుబాటులోకి రాకపోవడంతో పాటు మురుగు వ్యవస్థ లేకపోవడం వల్ల జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ వాసులు నానా యాతన పడుతున్నారు. మురుగు నిలిచిపోవడంతో దుర్వాసన, దోమలు, అంటువ్యాధులతో అల్లాడుతున్నారు. అంతేకాకుండా చినుకుపడితే వర్షపునీరు, మురుగునీరు రోడ్డుపైకి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అప్పటి ఎమ్మెల్యే మల్లాది విష్ణు చొరవతో..

ఇక్కడ ప్రజల అవసరాలకు అనుగుణంగా అమృత్ పథకంలో భాగంగా సుమారు రూ. 100 కోట్ల వ్యయంతో యూజీడీ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఇక్కడ యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మించేందుకు అవసరమైన స్థలం లేదు. దీంతో ముందుగా జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ ప్రాంతాల్లో యూజీడీ పైపులైన్ పనులను గత ప్రభుత్వ హయాంలో పూర్తిచేశారు. యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మించేందుకు అవసరమైన స్థలం లేకపోవడంతో అప్పటి విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు చొరవ తీసుకుని జీవీఆర్‌నగర్ అచంట వెంకటరత్నం నాయుడు సర్కిల్ సమీపంలో బుడమేరు పక్కన యూజీడీ పంపింగ్ స్టేషన్ నిర్మించాలని అధికారులకు సూచించారు. దీంతో బుడమేరు పక్కన పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టారు. సంపు, పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. మోటార్లు సైతం ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం హయాంలోనే పంపింగ్ స్టేషన్‌ను ప్రారంభించాలని ప్రయత్నించినప్పటికీ సాంకేతిక సమస్యలు, రైల్వే అనుమతుల్లో జాప్యం కారణంగా పనులు పూర్తి కాలేదు. ఇంతలో ఎన్నికలు రావడం ప్రభుత్వం, అధికారులు మారడంతో అసలు పంపింగ్ స్టేషన్‌ను పట్టించుకున్న వారే కరువయ్యారు.



జీవీఆర్‌నగర్‌లో నిర్మించిన సంపు

ప్రభుత్వ స్థలం లేకపోవడమే కారణం

ఇక్కడ లే అవుట్లు అన్నీ అనధికారమే కావడంతో కనీసం గజం స్థలం కూడా నగరపాలక సంస్థకు లేకుండా పోయిందని అధికారులు అంటున్నారు. ఇక్కడ ప్రభుత్వ స్థలం ఉండి ఉంటే ఎప్పుడో పనులు పూర్తిచేసేవారమని చెబుతున్నారు. ప్రజల అవసరాల మేరకు ఏ పనులు చేపట్టాలన్నా ఇక్కడ స్థలం లేకపోవడంతో పనులు నిర్ధేశించుకున్న సమయంలో పూర్తి చేయలేకపోతున్నామని అంటున్నారు. అలాగే ఇక్కడ రైల్వే అనుమతులు లభిస్తే రెండు నెలల్లోపు పనులు పూర్తిచేసి యూజీడీ పంపింగ్ స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు చెబుతున్నారు. కాగా తుది దశకు చేరుకున్న యూజీడీ పంపింగ్ స్టేషన్ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకు వస్తే ప్రజలకు మురుగు కష్టాలు తీరడంతో పాటు నగరపాలక సంస్థకు ఆదాయం లభించే అవకాశం ఉంది. ఇక్కడ జనాభా వేగంగా పెరుగుతున్న దృష్ట్యా అధికారులు స్పందించి యూజీడీ పంపింగ్ స్టేషన్ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక రంగవల్లులు



రంగవల్లుల పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రంగవల్లులు మన తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక మధురానగర్ నేతాజీ కాలనీలోని శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠం వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మహిళలు, చిన్నారులకు రంగవల్లులు, ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా అంకమ్మతల్లి శక్తిపీఠం వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆటలు, రంగవల్లుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్న పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావును అభినందించారు. మహిళలు వారిలోని సృజనాత్మకతను చాటుతూ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా రంగవల్లులు తీర్చిదిద్దారు. అలాగే ఆటల పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు విభాగాల వారీగా బహుమతులు ప్రదానం చేశారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది కృష్ణారావు, శ్రీనివాసరావు, జయభారత్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో ఎటువంటి లోపం లేకుండా ఉండాలి



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో ప్రతినిత్యం జరిగే ఇంటింటి చెత్త సేకరణలో ఎటువంటి లోపం లేకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉండాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ అన్నారు. 21వ డివిజన్, కృష్ణలంక ప్రాంతంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కమిషనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ నగరంలో ప్రతిరోజు నిత్యం వ్యర్థ సేకరణ జరుగుతుండాలని, ప్రతి డివిజన్‌లో నిరంతరం వ్యర్థాలు వేసే ప్రదేశాలను గుర్తించి వాటిని ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని ప్రజారోగ్యం విభాగం అధికారులను ఆదేశించారు. అనంతరం ఏపీఎస్ఆర్ఎం స్కూల్ వద్ద ఉన్న అన్నక్యాంటీన్ పరిశీలించారు. అన్నక్యాంటీన్‌లో ఆహార నాణ్యతలో, పరిశుభ్రతలో ఎటువంటి లోటు లేకుండా చూసుకోవాలని అన్నారు.

సద్గురు త్యాగరాజస్వామి సంగీతోత్సవాలు



కచేరీ నిర్వహిస్తున్న బ్రహ్మానందరావు, వాద్య సహకారం అందిస్తున్న ఆంజనేయులు

విజయవాడ కల్చరల్: సంగీత సన్మండలి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న శ్రీ సద్గురు త్యాగరాజస్వామి సంగీతోత్సవాలు భక్తిగా సాగుతున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్వాంసులు త్యాగరాజస్వామి రచించిన కీర్తనలను గానం చేస్తున్నారు. శుక్రవారం నాటి కార్యక్రమంలో సంగీత కళాశాల విశ్రాంత అధ్యాపకుడు కేవీ బ్రహ్మానందరావు, సీహెచ్ శ్రీదేవి, వీరుభొట్ల సీతారమణి, ఆకురాతి కోదండ రామయ్య, రమాభగవాన్, మోహన్ కృష్ణ, గుడిపాటి శ్రీలలిత గాత్రంతోనూ కావూరి హేమ, అయ్యగారి శ్యామసుందర్ వీణతోనూ త్యాగరాజ కృతులను ఆలపించారు. కొండా సుబ్రహ్మణ్యం, పాలపర్తి ఆంజనేయులు, చావలి శ్రీనివాస్, అంబటిపూడి కామాక్షి, కేవీ రామకృష్ణ వాద్య సహకారం అందించారు.

నేడు నగర సంకీర్తన

సంగీత సన్మండలి అధ్యక్షుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం ఎనిమిది గంటలకు సంగీత విద్వాంసులచే సంగీత కళాశాల నుంచి త్యాగరాజస్వామి, ఆంజనేయస్వామి విగ్రహాలతో నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నగరానికి చెందిన సంగీత విద్వాంసులు పాల్గొనాలని కోరారు.

రేపు నున్నలో ఉచిత యోగా శిక్షణ ప్రారంభం

నున్న(విజయవాడరూరల్): నున్న గీతామందిరంలో ఈ నెల 19వ తేదీన ఉచిత యోగా శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం నుంచి ప్రతి రోజూ ఉదయం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు 28 రోజుల పాటు క్లాసులు నిర్వహించనున్నారు. మహిళలు, పురుషులు పాల్గొనవచ్చునని తెలిపింది.

కూటమి ప్రభుత్వంలో క్రైస్తవులపై దాడులు

ఏఐసీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు జాన్ బెన్నీ లింగం



సమావేశంలో మాట్లాడుతున్న జాన్ బెన్నీ లింగం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో పాస్టర్లు, చర్చిలపై దాడులు జరుగుతున్నా కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఏఐసీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు జాన్ బెన్నీ లింగం అన్నారు. శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రైస్తవులపై కుట్ర చేస్తోందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు బీజేపీ చేతిలో కీలుబొమ్మలా మారిపోయాడన్నారు. క్రైస్తవ మతాన్ని అణచివేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో నిరుపేదలైన దైవ సేవకులకు గౌరవ వేతనం ఇవ్వడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆ గౌరవ వేతనం ఇవ్వడం లేదన్నారు. చర్చిల నిర్మాణం కోసం నిధులు విడుదల చేయాలని, జెరూసలేమ్ యాత్రకు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి త్యాగరాజ ఆరాధన మహోత్సవాలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస శర్మ తదితరులు

విజయవాడ కల్చరల్: హంసధ్వని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నుంచి నాలుగు రోజుల పాటు పడమట దత్తపీఠంలోని శ్రీ మరకత రాజరాజేశ్వరి దేవాలయంలో త్యాగరాజ ఆరాధన మహోత్సవాలు నిర్వహిస్తునట్లు నిర్వాహకులు యనమండ్ర శ్రీనివాసశర్మ తెలిపారు. గాంధీనగర్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం ఉదయం సనాతన వైదిక పద్ధతిలో త్యాగరాజ ఆరాధన ప్రారంభమవుతుందని, పంచరత్న కృతుల గోష్టిగానం, ములుకుట్ల బ్రహ్మానందశాస్త్రిచే త్యాగరాజ కృతి వైభవం ఉంటుందని చెప్పారు. 19వ తేది ఆధ్యాత్మిక ప్రసంగాలు, 20న వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులతో త్యాగరాజ కృతిగానం, 21, 22 తేదీల్లో ఆధ్యాత్మిక ప్రసంగాలు, సంగీత కచేరీలు నిర్వహిస్తునట్లు తెలిపారు. అనంతరం ఆరాధన మహోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దేవులపల్లి రామశాస్త్రి, గోపీకృష్ణశర్మ పాల్గొన్నారు.

అలరించిన హిందీ చిత్రగీతాలు



చిత్ర గీతాల కార్యక్రమంలో గాయకులు

విజయవాడ కల్చరల్: మెలోడీ మ్యూజికల్ మెస్మరైజర్స్, శ్రీపాద కళాపరిషత్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై శుక్రవారం నిర్వహించిన హిందీ చిత్రగీతాల కార్యక్రమం అలరించింది. హిందీ చిత్రసీమకు చెందిన గాయకులు కిషోర్‌కుమార్, మహ్మద్ రఫీ, లతా మంగేష్కర్, ఆశాభోస్లే, అనురాధా పోడ్వాల్, వాణీ జయరాం తదితరులు గానం చేసిన గీతాలను నండూరి రామానుజాచార్యులు, ఎం.రత్నకుమారి, చందనాసురేష్, రసూల్‌బాబు, బాల పృథ్వీరాజ్, ప్రిన్స్ ఆలపించారు. సీనియర్ గాయకుడు రామానుజా చార్యులు మాట్లాడుతూ భారతీయ చలన చిత్రరంగంలో కిషోర్‌కుమార్, మహ్మద్ రఫీ లాంటి వారు అరుదుగా కనిపిస్తారని గుర్తుచేశారు. కోట్లాది భారతీయుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నట్లు తెలిపారు. రంగస్థల దర్శకుడు, ప్రయోక్త టీవీ పురుషోత్తమ్ మాట్లాడుతూ లతా మంగేష్కర్, ఆశాభోస్లేలు తెలుగులోనూ పాటలు పాడారని పేర్కొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



గోడ పత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసం సందర్భంగా రోడ్డు సేఫ్టీ ఎన్జీఓ ఎన్టీఆర్ జిల్లా ప్రాంతీయ అధ్యక్షుడు బేతు రామమోహన్‌రావు ఆధ్వర్యాన తయారు చేసిన ప్రచార సామాగ్రి కరపత్రాలు, గోడ పత్రాలను శుక్రవారం బొండా ఉమా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు సేఫ్టీ ఎన్జీఓ ఎన్టీఆర్ జిల్లా ప్రాంతీయ అధ్యక్షుడు రామమోహన్‌రావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. కనకదుర్గ పద్మజ, సభ్యులు బంగారయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు సెక్షన్, సత్యనారాయణపురం ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ పి. రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భగత్‌సింగ్ రోడ్డు, దండమూరి రామ్మోహన్ వీధి, వందనపువారి వీధి, శివాలయం రోడ్డు, శివారావు వీధి, బ్రహ్మయ్యపంతులు వీధి, నర్రవారి వీధి, గిరీవీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మధురానగర్ సెక్షన్ పరిధిలో..

మధురానగర్ సెక్షన్ దేవీనగర్ ఫీడర్ పరిధిలో దేవీనగర్ ఒకటి నుంచి ఎనిమిదో లైన్ వరకు శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ రవీంద్రబాబు తెలిపారు.

ఆదమరిస్తే.. అంతే సంగతులు









విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. కనీసం నడిచేందుకు కూడా వీలు లేని విధంగా ఉన్నాయి. రోడ్డుపై కంకరు, రాళ్లు తేలి అత్యంత ప్రమాదకరంగా తయారయ్యాయి. పాముల కాలువ వైపునకు వెళ్లే మార్గంలో రోడ్డు పూర్తిగా గుంతలు పడి రాళ్లు పైకి లేచి వాహనాలు జారి పడే పరిస్థితి నెలకొంది. అలానే జక్కంపూడి కాలనీలో రోడ్డు గుంతలు పడి డ్రెయినేజీ నిండి అధ్వానంగా మారిన చిత్రాలివి.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

లలితాదేవికి ప్రత్యేక పూజలు



లలితాదేవి ఉపాసన పూజలు, పారాయణం నిర్వహిస్తున్న మహిళలు

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): స్థానిక పూర్ణానందపేటలోని దాసాంజనేయ కోదండరామ సుబ్రహ్మణ్యేశ్వర వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో శుక్రవారం లలితా సహస్రనామ పారాయణ మండలి వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పలు పుష్పాలతో పూజలు నిర్వహించారు. 81 మంది మహిళలు సంప్రదాయ పద్ధతిలో లలితాదేవి ఉపాసన పూజలు, పారాయణం నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కన్వీనర్ వేముల హజరత్తయ్య గుప్తా ఆధ్యాత్మిక వ్యాఖ్యానం చేస్తూ లలితా సహస్రనామ పారాయణ విశిష్టతను గురించి వివరించారు. బ్రహ్మాండ పురాణం 36వ అధ్యాయంలో లలితోపాఖ్యానంలో లలితా సహస్రనామ స్తోత్రం ఉందని, అందులో లలితా దేవిని సకల శక్తి స్వరూపిణి గానూ, సృష్టి స్థితి లయాధికారిణి గానూ వర్ణించబడిందన్నారు. హయగ్రీవుడు అగస్త్యమునికి లలితా సహస్ర నామ స్తోత్రాన్ని ఉపదేశించాడని, ఇందులో అనేక మంత్రాలు, సిద్ధి సాధనాలు, యోగ రహస్యాలు నిక్షిప్తమై ఉన్నాయని ప్రతీతి అన్నారు. ఈ స్తోత్రం పఠించడం వలన కష్టాలు కడతేరి, శుభాలు కలుగుతాయని, సిద్ధి ముక్తి లభిస్తాయని వివరించారు. పారాయణ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదాలను అందజేశారు.

హెల్మెట్ లేకపోతే బండి సీజ్



గుణదల(విజయవాడ తూర్పు): ద్విచక్ర వాహన చోదకులు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ లేకపోతే ఆయా వాహనాలను సీజ్ చేస్తామని మూడవ పట్టణ ట్రాఫిక్ సీఐ కే కిషోర్ బాబు హెచ్చరించారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసులు ఎన్నిసార్లు చెప్పినా చాలా మంది యువకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తప్పుబట్టారు. హెల్మెట్ లేకుండా అతివేగంగా రాకపోకలు సాగించడం ప్రమాదకరమని హెచ్చరించారు. అనంతరం వాహనాల రికార్డులను పరిశీలించి ప్రయాణికులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.